
సాక్షి
పల్నాడు
శనివారం । 28 । డిసెంబర్ । 2024



ఓటింగ్ మిషన్ల తనిఖీ

నరసరావుపేట: స్థానిక మార్కెట్ యార్డులోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుక్రవారం తనిఖీ చేశారు. డీఆర్వో ఎ.మురళి పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 573.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 7,678 క్యూసెక్కులు వదిలారు.



ఈవీఎంల పరిశీలన

బాపట్ల: స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎంల) గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

జెస్సీ రాజ్‌కు ఘన స్వాగతం



విమానాశ్రయం(గన్నవరం): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బాలపురస్కార్ అవార్డు అందుకున్న గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీ రాజ్‌కు శుక్రవారం గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. న్యూఢిల్లీలో అవార్డు స్వీకరించిన తర్వాత జెస్సీ రాజ్ మధ్యాహ్నం ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆమెకు పలువురు క్రీడా సంఘ పెద్దలు, క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

పది ఫీజు తత్కాల్ గడువు పెంపు

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు గడువును జనవరి 10వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తత్కాల్ స్కీమ్‌లో భాగంగా ఈనెల 27వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు రూ.1000 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించిందని వివరించారు. జిల్లా పరిధిలోని ఉప విద్యాశాఖాధికారులు గడువు పొడిగింపును గమనించి వివిధ కారణాలతో ఇప్పటికీ ఫీజు చెల్లించకుండా మిగిలిపోయిన విద్యార్థులచే పరీక్ష ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

దూరవిద్య ప్రవేశానికి తత్కాల్ ఫీజు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దూరవిద్య పదో తరగతి, ఇంటర్మీడియేట్ కోర్సులలో ప్రవేశానికి ఈనెల 31వ తేదీ వరకు తత్కాల్ స్కీమ్ కింద గడువు పొడిగించినట్టు డీఈఓ చంద్రకళ తెలిపారు. అభ్యాసకులు సాధారణ అడ్మిషన్ ఫీజుకు అదనంగా రూ.600 తత్కాల్ ప్రవేశ రుసుం చెల్లించి ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యాసకులు తమ సమీపంలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, సమన్వయకర్తను సంప్రదించాలని సూచించారు.

31 వరకు సచివాలయాల్లో ఎస్సీ కులగణన వివరాలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ జనాభాపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యం ఈనెల 26 నుంచి 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎస్సీ కులగణన వివరాలను ప్రదర్శిస్తున్నట్టు కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 31 వరకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని వివరించారు. 2025 జనవరి 6న వచ్చిన అభ్యంతరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10న కులగణన తుది వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి

నగరంపాలెం(గుంటూరువెస్ట్): వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి మోటారు సైకిళ్లను నడపాలని ఎస్పీ సతీష్ కుమార్ చెప్పారు. హెల్మెట్ వాడకంపై అవగాహన నిమిత్తం పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద మోటారు సైకిళ్ల ర్యాలీని శుక్రవారం ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వాడకంతో చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఇబ్బందులు తప్పవని చెప్పారు. హెల్మెట్‌లు ధరించి వాహనాలు నడిపితే అన్ని విధాలా ఉపయోగకరమని చెప్పారు. పోలీసులు హెల్మెట్‌లు ధరించి ర్యాలీ పాల్గొన్నారు.



నరసరావుపేటలో జరిగిన పోరుబాటలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు



చిలకలూరిపేటలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి విడదల రజని, పార్టీ నాయకులు

విద్యుత్ బాదుడుపై జనాగ్రహం

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు

- ప్రజలపై మోయలేని విద్యుత్ భారాన్ని మోపిన కూటమి సర్కార్
- అన్ని నియోజకవర్గ కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు
- తరలి వచ్చిన ప్రజలు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు
- నినాదాల హోరు
- తగ్గించకుంటే తప్పదు పోరు అన్న నాయకులు
- అధికారులకు వినతిపత్రాలు అందజేత
- అడ్డంకులు సృష్టించిన పెదకూరపాడు పోలీసులు



మాచర్లలో నిర్వహించిన పోరుబాటకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నేతృత్వంలో తరలివచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు

సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డివిరిచింది. విద్యుత్ చార్జీల బాదుడుపై పల్నాడు జిల్లా వ్యాప్తంగా జనాగ్రహం పెల్లుబికింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాలలో శుక్రవారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. పెంచిన బిల్లులు తగ్గించాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. పోలీసుల ఆంక్షలను పట్టించుకోకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేశారు. భారీ ఫ్లెక్సీలు, ప్లకార్డులు, జెండాలు ప్రదర్శించారు.

మాచర్లలో...

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు శుక్రవారం పార్టీ కార్యాలయం నుంచి మాచర్ల డివిజనల్ విద్యుత్ శాఖ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తాడివెంకటేశ్వరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నవ్వులూరి భాస్కరరెడ్డి, మాజీ వ్యవసాయ శాఖ అడ్వైజర్ కమిటి సభ్యుడు మేకల కోటిరెడ్డి, ప్రస్తుత ఎంపీపీ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

బాబు ష్యూరిటీ అంతా బోగస్... బాదుడు మాత్రమే గ్యారెంటీ అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని విమర్శించారు. పార్టీ తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరయ్యారు. రజిని మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలిగినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూనే వుంటామని తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఈఈ రమేష్‌బాబుకు వినతి పత్రాన్ని అందించారు.

నరసరావుపేటలో...

ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ పోరుబాటలో భాగంగా శుక్రవారం పార్టీ కార్యాలయం నుంచి వందలాదిమంది నాయకులు, కార్యకర్తలతో విద్యుత్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. పోలీసులు కార్యాలయం ఎదుట రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటుచేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను నిలిపివేశారు. అధికారులకు వినతిపత్రం అందజేస్తామని డాక్టర్ గోపిరెడ్డి సూచన మేరకు ఆయనతో పాటు మరో పదిమందిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతించారు. కార్యాలయం బయట డీఈ సీహెచ్.రాంబొట్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల సాంబశివారెడ్డి, సీనియర్ నాయకుడు కాకుమాను మంగపతిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ముదిరాజు, మాదిగ, గిరిజన కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు ఇయంస్వామి, కందుల ఎజ్రా పాల్గొన్నారు.

వినుకొండలో...

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వినుకొండలో నిరసన ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో వందలాది మంది పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి కారంపూడిరోడ్డులోగల విద్యుత్ సబ్ స్టేషను వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ ఏఈఈ పిచ్చయ్యకు వినతిపత్రం అందజేశారు. ఎంపీపీలు మేడం జయరామిరెడ్డి, పగడాల వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు విజయలక్ష్మిరాజా, నాయక్, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, సొసైటీ అధ్యక్షులు అనుమోలు నాసర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్లు, అమ్మిరెడ్డి అంజిరెడ్డి, గంధం బాలిరెడ్డి, న్యాయవాది ఎం.ఎస్. ప్రసాదు, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, మండల కన్వీనర్ డి.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గురజాలలో...

రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా కంటక పాలనను అంతమొందించే వరకు పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పోరుబాటలో భాగంగా శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ అద్దె ఇళ్లలో ఉండేవారికి అద్దె కన్నా కరెంటు చార్జీలు అధికంగా వస్తున్నాయన్నారు. లాంతర్లు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె అన్నారావు, వైద్యుడు చింతలపూడి అశోక్‌కుమార్, దేవళ్ల రేవతి పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

విద్యుత్ బిల్లుల బాదుడును నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు పెదకూరపాడులో పోరుబాట నిర్వహించారు. పెదకూరపాడులోని సినిమా హాల్ సెంటర్ వద్ద నుంచి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కాలచక్ర రహదారిపై ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ కార్యాలయం ఏఈ దాసరి రామకృష్ణకు వినతి పత్రం అందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి లేదని, బ్యానర్ తీసివేయాలని పోలీసులు ఆదేశించారు. ప్రజల పక్షాన శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అడ్డుకోవడం సరికాదని పార్టీ నేతలు స్పష్టం చేశారు. ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి లేదని, కాదని నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. దీంతో బ్యానరు లేకుండా విద్యుత్ కార్యాలయానికి నడిచివెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీలు బెల్లంకొండ మీరయ్య, పద్మ వెంకటేశ్వరరెడ్డి, కోటయ్య, గంగసాని నరసింహారావు, జెడ్పీటీసీలు కంకణాల స్వర్ణకుమారి, వెంకటరెడ్డి, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ మెంబర్ షేక్ హస్మీ, పార్టీ మండల అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, భవిరిశెట్టి హనుమంతరావు, చింతారెడ్డి సాయిరెడ్డి, రామచంద్రయ్య, అప్పారావు, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో...

రాష్ట్రంలో సీఎం చంద్రబాబు దుర్మార్గ పాలన సాగిస్తున్నాడని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత చిట్టా విజయభాస్కరరెడ్డి విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమాన్ని శుక్రవారం సత్తెనపల్లిలో నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద నుంచి ప్రదర్శనగా గుంటూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయానికి చేరుకొని వినతిపత్రం అందించారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి మండల అధ్యక్షుడు ఆర్.పురుషోత్తమరావు మాట్లాడారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావునాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు, నాయకులు షేక్ మౌలాలి, వేపూరి శ్రీనివాసరావు, కళ్లం విజయభాస్కర్‌రెడ్డి, అచ్యుత శివప్రసాద్ పాల్గొన్నారు.

భారాలు మోపుతున్న బాబు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతోంది. ఇచ్చిన హామీ అమలు చేయకుండా మోసం చేసే పనిలో ఉన్నారు. ప్రజలందరూ ఆశతో ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే వారిని మోసగించే పద్ధతిలో కూటమి ప్రభుత్వం పాలన సాగుతోంది. చార్జీలు పెంచబోమని చెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు ఆర్టీసీ, విద్యుత్ చార్జీలతోపాటు, అనేక పన్నులు విధించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో అక్రమ కేసులతో సోషల్ మీడియా యాక్టివిస్టులను బెదిరిస్తూ, వైఎస్సార్ సీపీ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తూ కూటమి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోంది. అయినా ఏ ఒక్క కార్యకర్త, నాయకుడు, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. మళ్లీ మంచి రోజులు వస్తాయి.

–పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు



గురజాలలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నాయకులు



వినుకొండలో నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, నాయకులు



సత్తెనపల్లిలో ప్రదర్శనకు తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు



పెదకూరపాడులో నిర్వహించిన పోరుబాటకు తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

మొక్కల సంరక్షణ.. గ్రామాల అభివృద్ధి

- వన సంరక్షణ సమితుల ఆధ్వర్యంలో అడవులలో చెట్ల పెంపకం
- సాధారణ చెట్లతోపాటు యూకలిప్టస్ మొక్కల పెంపకం
- కోత దశకు వచ్చిన 15 ఏళ్ల కిందట నాటిన మొక్కలు
- చెట్ల ద్వారా వచ్చిన సగం ఆదాయంతో గ్రామాల అభివృద్ధి



వెంకటాయపాలెం బీట్ పరిధిలో వీఎస్ఎస్ ప్లాంట్లలో కోతకు వచ్చిన చెట్లు

బెల్లంకొండ: అడవులు ఆక్రమణలకు గురవడంతోపాటు పోడు వ్యవసాయం కారణంగా అడవులు వ్యవసాయ భూములుగా మారుతున్నాయి. అడవులలో చెట్లు నరికివేస్తుండడంతో మొక్కలు పెంచాలన్న లక్ష్యంతో అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అడవుల సంరక్షణ ధ్యేయంగా 15 ఏళ్లుగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్నారు. వన సంరక్షణ సమితులను ఏర్పాటు చేసి మొక్కల సంరక్షణ బాధ్యతను కమిటీలకు అప్పగించారు. చెట్లను పెంచి అడవులను పెంచడంతోపాటుగా వాటి ద్వారా వచ్చిన ఆదాయంతో అడవులు, గ్రామాలను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు చేపట్టారు. పిడుగురాళ్ల, నరసరావుపేట అటవీశాఖ రేంజ్‌ల పరిధిలో ఉన్న పెదకూరపాడు నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాలలో మొక్కలు నాటారు. బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట, అమరావతి, పెదకూరపాడు మండలాలలోని అటవీ ప్రాంతాల్లో యూకలిప్టస్ చెట్లను పెంచుతున్నారు. 15 ఏళ్ల క్రితం నాటిన మొక్కలు ప్రస్తుతం కోత దశకు వచ్చి ఉన్నాయి. ప్రస్తుతం అటవీశాఖ అధికారులు వాటిని విక్రయించేందుకు, చెట్లకు నంబర్లు వేసే పనిలో నిమగ్నం అవుతున్నారు.

వన సంరక్షణ సమితి బాధ్యతలు

అటవీ ప్రాంతాలలో మొక్కలను పెంపొందించేందుకు 1996లో ప్రభుత్వం వన సంరక్షణ సమితులను ఏర్పాటు చేసింది. సభ్యులుగా సమీప గ్రామాల అటవీ ప్రాంత ప్రజలను తీసుకుంటారు. వీరి ద్వారా మొక్కలను నాటించడం, సంరక్షించడం, వాటి పోషణకు సంబంధించిన పనులను చేయిస్తుంటారు. దీనికిగాను వారికి కూలీ నగదు చెల్లిస్తుంటారు. పిడుగురాళ్ల అటవీ శాఖ రేంజ్ పరిధిలో అధిక శాతం గ్రామాలలో ఖాళీగా ఉన్న అటవీ ప్రాంతాల్లో యూకలిప్టస్ మొక్కలను పెంచి, సంరక్షిస్తున్నారు.

వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులు..

అడవులలో వేసిన మొక్కలు కొన్నేళ్ల తర్వాత కోత దశకు వస్తాయి. వీటిని అటవీశాఖ అధికారుల ఆమోదంతో విక్రయిస్తుంటారు. వీటి ద్వారా వచ్చిన ఆదాయంలో వన సంరక్షణ సమితులకు సగభాగం, కొంత ప్రభుత్వానికి, కొంత అడవులలోని మొక్కల సంరక్షణకు ఖర్చు చేస్తారు. వీఎస్ఎస్‌లు గ్రామ కమిటీలను ఏర్పాటుచేసుకుని వచ్చిన ఆదాయంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి.

300 హెక్టార్లలో వీఎస్ఎస్‌లు ఏర్పాటు..

పిడుగురాళ్ల, నరసరావుపేట రేంజ్‌ల పరిధిలలోని ఐదు మండలాల వ్యాప్తంగా దాదాపుగా 300 హెక్టార్లలో మొక్కలను నాటారు. పిడుగురాళ్ల రేంజ్‌లోని పాపాయపాలెం, వెంకటాయపాలెం, కోనంకి, త్రిపురాపురం, దొడ్లేరు, ఎండ్రాయి బీట్‌లలో దాదాపుగా 225 హెక్టార్లలో దాదాపుగా మొక్కలు నాటారు. నరసరావుపేట రేంజ్ పరిధిలో అచ్చంపేట, మాదిపాడు తదితర బీట్‌లలో సుమారుగా 75 హెక్టార్లలో చెట్లు పెంచుతున్నారు.

అడవుల్లో చెట్లను పెంచడమే ధ్యేయం



అటవీ ప్రాంతాలలో చెట్లను పెంచడమే ధ్యేయంగా వీఎస్ఎస్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తద్వారా చెట్లను పెంచి, అడవులను సంరక్షించడంతోపాటుగా వచ్చిన ఆదాయంతో అడవుల విస్తరణకు కృషి చేయడం, గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం వీఎస్ఎస్‌ల బాధ్యత. ప్రస్తుతం రేంజ్ పరిధిలో పెంచిన చెట్లు 15 ఏళ్లు దాటుతుంది. ప్రస్తుతం మొక్కలకు నంబర్లు వేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశిస్తే వీఎస్ఎస్ కమిటీల పర్యవేక్షణలో చెట్లును విక్రయిస్తాం.

– విజయకుమారి, ఫారెస్ట్ రేంజ్ అధికారి, పిడుగురాళ్ల

క్లుప్తంగా

మూడు లారీల్లో 400 లీటర్ల డీజిల్ చోరీ

శావల్యాపురం: మండలంలోని గంటావారి పాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ సమీపంలో పార్కింగ్ చేసిన మూడు లారీల్లో 400 లీటర్ల డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. లారీ యాజమాని చెన్నా చంద్రశేఖర్‌బాబు తెలిపిన వివరాలు మేరకు వినుకొండ నుంచి వరంగల్‌కు కంది పొట్టు లోడుతో లారీ బయలుదేరింది. రాత్రి కావటంతో లారీని లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి దేవాలయం ఎదుట పార్కింగ్ చేసి క్లీనర్‌ను కాపలాగా ఉంచి డ్రైవర్ స్వగ్రామమైన గంటవారిపాలెం వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో కారులో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి 400 లీటర్ల డీజిల్ చోరీ చేశారు.లారీ యజమాని చెన్నా చంద్రశేఖర్‌బాబు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శావల్యాపురం సెంటరులో ఉన్ననటువంటి సీసీ కెమెరాలు పోలీసులు పరిశీలించుతున్నట్లు తెలిపారు.

ఘనంగా కోస్టల్ బ్యాంకు రజతోత్సవం



నరసరావుపేట: స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకులో శుక్రవారం బ్యాంకు రజతోత్సవం ఘనంగా నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఖాతాదారుల నమ్మకంతో బ్యాంకు 25 ఏళ్లు పూర్తిచేసుకుందన్నారు. బ్యాంకులో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో నెల్లూరి సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ డాక్టర్ నెల్లూరి సురేష్ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, ఖాతాదారులు, ప్రజలకు ఉచితంగా గుండె, బీపీ, మధుమేహం పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా ఫెన్సింగ్ జట్టు

గుంటూరువెస్ట్ (క్రీడలు): ఈనెల 28, 29 తేదీల్లో కాకినాడలో జరగనున్న 10వ ఏపీ అంతర్ రాష్ట్ర పోటీలకు అండర్-17 బాల బాలికల జిల్లా ఫెన్సింగ్ జట్టును ఎంపిక చేశామని గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి గురువారం జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించామన్నారు. ఎంపికైన జట్టు రాష్ట్ర పోటీలలో పాల్గొంటుందని తెలిపారు.

సీఎం చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు



హెలిప్యాడ్ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు తదితరులు

నరసరావుపేట రూరల్: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 31వ తేదీన మండలంలోని యల్లమందలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. గ్రామ సమీపంలోని పంట పొలాల్లో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. హెలిప్యాడ్ ఏర్పాటు పనులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరేలు శుక్రవారం పరిశీలించారు. గ్రామ సమీపంలోని రహదారుల వెంట వ్యర్థాలను తొలగించే పనిని పంచాయతీరాజ్ శాఖ చేపట్టింది. గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కరరెడ్డి, ఎంపీడీవో సూర్యకుమారిలు శుక్రవారం గ్రామంలో పర్యటించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య, పరిశుభ్రత పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ రాజానాయక్, ఆర్డీవో మధులత, తహసీల్దార్ వేణుగోపాలరావు, ఈవోపీఆర్డీ నాగానంద్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- జనవరి 24న ఏడీ ఆఫీసుల వద్ద చేనేత కార్మికుల ధర్నా
- ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లలమర్రి బాలకృష్ణ

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేత కార్మికులకు గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలు మర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలోని ఫణిదం చేనేత సొసైటీ భవనంలో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివదుర్గారావు అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత చేనేత ప్రధానమైన వృత్తి అని చెబుతున్న పాలకులు బడ్జెట్లో చేనేతకు నిధులు లేకుండా చేయడం అన్యాయమన్నారు. తక్షణం చేనేత కార్మికుల సమస్యలకు రూ.2 వేల కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అమలు జరిపిన నేతన్న నేస్తం పథకం అమలు జరపకుండా రద్దు చేయడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికై చర్యలు తీసుకోవాలని రాష్ట కమిటీ తీర్మానం చేసింది. సమస్యల పరిష్కారానికై జనవరి 24న అన్ని ఏడీ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలలో చేనేత కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి దోకుపర్తి రామారావు, వాసా గంగాధరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు అనుముల వీరబ్రహ్మం, వీరనాల శివ నారాయణ, కవుతరపు వెంకటేశ్వరరావు, గోరు రాజు, గద్దె హేమసుందర రావు (బాబు), మురుగుడు సత్యనారాయణ, దీపాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్ డిఫెన్స్ లిక్కర్ స్వాధీనం

- దుస్తుల దుకాణం పేరుతో పార్శిల్లో దిగుమతైన మద్యం
- 70 సీసాలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు



వివరాలు తెలియజేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): దుస్తుల దుకాణం పేరుతో పార్సిల్‌లో ఉత్తరఖండ్ నుంచి డిఫెన్స్ మద్యాన్ని గుంటూరుకు తీసుకువచ్చి వడ్లమూడి గ్రామంలో అధిక ధరలకు అమ్మేందుకు తీసుకువెళుతున్న ఆర్మీ రిటైర్డ్ హవల్దార్‌ను, అతనితోపాటు మరొక వ్యక్తిని, ఒక ఆటోను, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఇ.మారయ్యబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరు ఎక్సైజ్-2 స్టేషన్‌లో పోలీసులు నిందితుల వివరాలు వెల్లడించారు. వడ్లమూడికి చెందిన బాలాజీ బాబు సింహాద్రి ఆర్మీ హవల్దార్‌గా ఉత్తరాఖండ్ రాష్ట్రంలో పనిచేసి రిటైర్ అయ్యాడు. అక్కడ ఉన్న పరిచయాలతో డిఫెన్స్ మద్యాన్ని పార్సిల్ రూపంలో గుంటూరుకు తీసుకువచ్చి వడ్లమూడిలో అమ్ముతున్నాడు. శుక్రవారం ఉత్తరాఖండ్ నుంచి గుంటూరుకు దుస్తుల దుకాణం పేరుతో ఒక పార్సిల్‌లో తీసుకొచ్చి ఇక్కడి నుంచి ఆటోలో వడ్లమూడి తరలిస్తున్నారన్న సమాచారంతో తెల్లవారుజామున దాడిచేసి బాలాజీ బాబు, బొలగాని వెంకటేశ్వరరావులను అరెస్టుచేసినట్టు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి 750 ఎంఎల్ పరిమాణం గల 70 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సీఐ యశోధరదేవి, ఎస్ఐ కె.సత్యనారాయణ, సిబ్బంది హనుమంతరావు, ఎం.శ్రీనివాసరావు, పి.నాగేశ్వరరావు, జె.వెంకటేశ్వరరావు, ఎస్‌వీవీ ప్రసాద్, జి.రవిబాబు, ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు.

బాలుడి పై కత్తితో దాడి



గాయపడిన బాలుడు శ్రీనివాసరావు

బెల్లంకొండ: తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమనడంతో బాలుడిపై కత్తితో దాడికి పాల్పడి గాయపరిచిన ఘటన మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై డి.ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొజ్జా శ్రీనివాసరావు(17) వద్ద అదే గ్రామానికి చెందిన మన్నేపల్లి పిచ్చయ్య కొద్దిరోజుల కిందట రూ.200 అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడగడంతో ఇరువురి మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో గ్రామంలోని మద్యం దుకాణం వద్ద కనిపించడంతో పిచ్చయ్యను డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న పిచ్చయ్య శ్రీనివాసరావు మెడపై కత్తితో దాడి చేశాడు. స్థానికులు వెంటనే శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో 108 వాహనంలో సత్తెనపల్లి ప్రభుత్వా సుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

బెల్లంకొండ: ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలవగా, వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై డి ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం..మాచవరం మండలం రుక్మిణీపురం గ్రామానికి చెందిన బాణావతు అశోక్ కుమార్ నాయక్(32) పాపాయపాలెం మూడు రోడ్ల కూడలి వద్ద జామకాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళుతున్న సమయంలో పాపాయపాలెం శివారులో పిడుగురాళ్ల నుంచి బైక్‌పై ఎదురుగా వస్తున్న వ్యక్తి అశోక్‌కుమార్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అశోక్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు గుంటూరు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు అశోక్‌కు భార్య నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఆరు నెలల గర్భిణి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

అనుమానంతో భార్యను కొట్టి చంపిన భర్త



కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నరసరావుపేటరూరల్: అనుమానంతో భార్యను కొట్టి చంపి ఇంట్లోనే ఉరివేసిన సంఘటన మండలంలోని గురవాయపాలెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన గర్నెపూడి రమేష్, అనిత(31)లు దంపతులు, వారిద్దరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నాడు. వీరు పొగాకు పనిచేస్తుంటారు. భార్యపై కొంతకాలంగా భర్త రాజేష్‌కు అనుమానం ఉంది. భార్య పొగాకు పనికి కూడా రావట్లేదు. దీంతో ఆమెపై ఇంకా అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆమెను ఇంట్లోనే తీవ్రంగా కొట్టి చంపి నైలాన్ తాడుతో ఉరివేశాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ కిషోర్ తన సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆత్మీయ సమ్మేళనం



పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఎఫ్, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: శాసనమండలి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి మార్చిలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రస్తుత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును మళ్లీ గెలిపించుకోవాలని కోరుతూ ఈనెల 29న మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరులోని ఎన్జీఓ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.కళాధర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. కళాధర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై, ఉద్యోగ, కార్మిక సంఘాల గొంతుకగా పనిచేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీగా గెలిచిన నాటి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, నిరుద్యోగ సమస్యలపై శాసనమండలి లోపల, వెలుపల ప్రభుత్వాలతో లక్ష్మణరావు పోరాటం చేస్తున్నారని, ఆయనను మళ్లీ గెలిపించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు సలీం, ఆవాజ్ రాష్ట్ర కన్వీనర్ ఎండీ చిష్టీ, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, యూటీఫ్ జిల్లా అధ్యక్షుడు యు.రాజశేఖర్‌రావు, జి.వెంకటేశ్వరరావు, ప్రేమ్‌కుమార్, ఆదినారాయణ, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు జి.వెంకట్రావు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కృష్ణానదిలో చేపపిల్లలను వదులుతున్న అధికారులు

తాడేపల్లిరూరల్ : మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు జిల్లా స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎ.లక్ష్మీకుమారి చెప్పారు. శుక్రవారం ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతంలో పడవలరేవు వద్ద కృష్ణా మీనోత్సవంలో భాగంగా నదిలో చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మీకుమారి, జిల్లా మత్స్యశాఖ అధికారి గాలిదేవుడు, తాడేపల్లి తహసీల్దార్ డి.సీతారామయ్య అధికారులతో కలసి నదిలో చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా లక్ష్మీకుమారి మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా 12.50 లక్షల చేపపిల్లలను వదిలామని తెలిపారు. కార్యక్రమంలో నిడుబ్రోలు ఎఫ్‌డీవో ఎం.డి.జయినుల్లా ఖాన్, గుంటూరు ఎఐఎఫ్ అధికారి కె.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ అప్రెంటీస్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ఏపీఎస్ఆర్టీసీ అప్రెంటీస్‌షిప్ చేసేందుకు నవంబరు 6 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థుల విద్యార్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలన తేదీలను ఖరారు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని డాక్యుమెంట్ సక్రమంగా అప్‌లోడ్ చేయని అభ్యర్థుల వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్‌సీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచామని, వీరు విభాగాల వారీగా సూచించిన తేదీల్లో విజయవాడలోని విద్యాధరపురం చెరువు సెంటర్ వద్ద ఉన్న ఆర్టీసీ శిక్షణ కళాశాల వద్దకు ఉదయం 10 గంటలకు విద్యార్హత, ధ్రువీకరణ పత్రాలతో రావాలని వివరించారు. శనివారం నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని వెల్లడించారు. పూర్తి వివరాల కోసం 7382900591, 7282900299, 7989790054 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రొంపిచర్ల చారిత్రక ఆనవాళ్లను పరిరక్షించాలి

పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి



విగ్రహాలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామ శివారులోని వేణుగోపాల స్వామి దేవాలయానికి వెళ్లే దారిలో క్రీస్తు శకం 10-13 శతాబ్దాల కాలానికి చెందిన శిల్పాలు, శాసనాలు భూమిలో కూరుకుపోయి నిర్లక్ష్యంగా పడి ఉన్నాయని వాటిని పరిరక్షించుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ), ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మధుచౌక్‌లోని సీసీవీఏ కార్యాలయం ఆవరణలో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. వారసత్వ సంపదను గుర్తించి పరిరక్షించుకుని భవిష్యత్ తరాలకు అందించడానికి సీసీవీఏ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా రొంపిచర్ల గ్రామంలో శుక్రవారం పర్యటించానన్నారు. క్రీస్తుశకం 10వ శతాబ్దానికి చెందిన మహిషాసురమర్ధిని, బ్రహ్మ, కుమారస్వామి, భైరవ, నంది విగ్రహాలతో పాటుగా కాకతీయ గణపతి దేవుడు, ప్రతాపరుద్రుడు పాలనకు చెందిన రాతి శాసనాలు అక్కడి భూమిలో కూరుకుపోయి ఉన్నాయన్నారు. క్రీస్తు శకం 1320 నాటి ప్రతాప రుద్రుని శాసనంలో అనంత గోపీనాథ దేవాలయానికి రెడ్ల చెరువు వెనక కొంత భూమిని దానం చేసిన వివరాలు, అలాగే క్రీస్తు శకం 1245 నాటి కోట భీమరాజు మంత్రి వల్లభుడు, రొంపిచర్లలో కట్టించిన గోపీనాథ ఆలయానికి కొంత భూమిని దానం చేసిన వివరాలు ఈ శాసనాల్లో ఉన్నాయని శివనాగిరెడ్డి వివరించారు. రొంపిచర్ల గ్రామ చరిత్రకు సాక్ష్యాలైన ఈ శిల్పాలు, శాసనాలు కాపాడుకుని ఆలయంలో ప్రత్యేకంగా వీటిని భద్రపరిచి భవిష్యత్ తరాలకు అందించాలని శివనాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గట్టుప్పల్ శ్రీనివాస్, బి.వెంకటరెడ్డి తనకు సహకరించారన్నారు.

వెలుగు ఏపీఎం వేధింపులకు గురి చేస్తుంది

- మాకు ఉద్యోగ భద్రత కల్పించండి
- తహసీల్దార్‌కు పలు గ్రామాల యానిమేటర్లు ఫిర్యాదు



పెదకూరపాడు తహసీల్దార్ డానియేలుకు ఫిర్యాదు చేస్తున్న యానిమేటర్లు

పెదకూరపాడు: పల్నాడు జిల్లా పెదకూరపాడు ఏపీఎం బొబ్బ సునీత, సీసీలు మామూళ్ల కోసం వేధింపులకు గురి చేస్తున్నారని, సునీత నుంచి మాకు రక్షణ కల్పించాలని, మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండలంలోని పెదకూరపాడు, బుస్సాపురం, లింగంగుంట్ల, పాడపాడు, జలాల్‌పురం గ్రామాలకు చెందిన పలువురు యానిమేటర్లు శుక్రవారం పెదకూరపాడు తహసీల్దార్ మీసాల డానియేలుకు ఫిర్యాదు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆయా గ్రామాల్లో యానిమేటర్లుగా సక్రమంగా విధులు నిర్వహిస్తున్నామని, కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మీరు విధులకు రావద్దని, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో మా ఉద్యోగాలు తొలగించే ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా, సక్రమమైన తీర్మానాలు లేకుండా మా ఉద్యోగాలను వేరే వారికి ఇచ్చేలా ఒత్తిడి తెస్తుందన్నారు. సీసీగా పనిచేస్తున్న వారు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వారి నుంచి రక్షణ కల్పించి, మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఏపీఆర్జేసీ కళాశాలను సందర్శించిన టీఎస్ ఐజీ రమేష్



ఏపీఆర్ జూనియర్ కళాశాలలో టీఎస్ ఐజీ రమేష్, పక్కన ప్రిన్సిపాల్ సరోజిని

విజయపురిసౌత్: ఏపీఆర్జేసీ పూర్వ విద్యార్థి, తెలంగాణ రాష్ట్ర ఐజీ మస్తిపురం రమేష్ శుక్రవారం నాగార్జునసాగర్, విజయపురిసౌత్‌లోని ఏపీఆర్ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఏపీఆర్ జూనియర్ కళాశాలలో 1987-89 బ్యాచ్‌కు చెందిన ఐజీ రమేష్ సీఈసీ గ్రూప్‌లో కళాశాల టాపర్‌గాను, రాష్ట్రంలో తొమ్మిదో స్థానంలో నిలిచారు. కుటుంబ సమేతంగా కళాశాలకు చేరుకున్న ఐజీకి ప్రిన్సిపాల్ సరోజిని ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఐజీ రమేష్ కళాశాలలో తిరుగుతూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఐజీ వెంట విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ, సాగర్ ఎస్ఐ సంపత్ గౌడ్, హాలియా ఎస్ఐ వీరబాబు, అధ్యాపకులు హేమాంబర్‌రెడ్డి, లింగేశ్వరావు, సీహెచ్ చంద్రశేఖర్, డిప్యూటీ వార్డెన్ రత్నబాబు, పూర్వ విద్యార్థి రమేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ గేటుకు తాళాలు

- ఇనుపవైర్లతోనూ గేట్లు కట్టేసిన వైనం
- అధికారుల అత్యుత్సాహం
- వైఎస్సార్ సీపీ శ్రేణులు వస్తున్నారని దుశ్చర్య
- డిమాండ్లతో కూడిన పత్రం ఇవ్వకుండా చేసేందుకు పన్నాగం
- స్థానికులు ప్రశ్నించడంతో తాళాలు తీసిన సిబ్బంది
- కూటమి నేతల ప్రసన్నం కోసమేనని విమర్శలు



విద్యుత్ సబ్ స్టేషనుకు మెయిన్ గేట్ మూసి వేసి తాళాలు వేయించిన విద్యుత్‌శాఖ అధికారులు

ప్రత్తిపాడు: విద్యుత్ సబ్‌స్టేషన్ మెయిన్ గేటుకు తాళాలు వేయించి విద్యుత్‌శాఖ అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, ఏ అధికారీ వ్యవహరించని విధంగా వ్యవహరించి విమర్శలపాలయ్యారు. వివరాల్లోకి వెళితే పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ పోరుబాటకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు నిరసన ర్యాలీగా సబ్‌స్టేషన్‌కు బయల్దేరారు. విషయం తెలుసుకున్న ఏఈ గౌతమ్ తమ సిబ్బందితో విద్యుత్ సబ్ స్టేషన్ మెయిన్ గేట్‌కు తాళాలు వేయించారు. ఎవరూ లోపలకు రాకుండా ఇనుప వైర్లతో గేట్లు కట్టివేశారు. ఇంతలో అక్కడకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మీడియా ప్రతినిధులు గేట్లుకు తాళాలు వేసి ఉండడంతో అవాక్కయ్యారు. స్థానికులు సిబ్బందిని ప్రశ్నించడంతో ఏఈ తాళాలు వేయమన్నారని చెప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో సిబ్బంది హడావుడిగా వచ్చి తాళాలు తీశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు డిమాండ్లతో కూడిన పత్రం ఇవ్వడానికి వస్తున్నందునే ఇలా తాళాలు వేశారని ఆ పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. కూటమి నాయకుల మెప్పు పొందడంతోపాటు వారి కళ్లలో ఆనందం చూసేందుకే విద్యుత్ అధికారులు ఇలా కార్యాలయానికి గతంలో ఎన్నడూ లేని విధంగా తాళాలు వేయించారనే విమర్శలు వెల్లువెత్తాయి.

స్మార్ట్‌మీటర్లు బిగిస్తే ఊరుకోం

అడ్డుకున్న సీపీఎం నాయకులు



స్మార్ట్ మీటర్లు బిగించేందుకు వచ్చిన వారిని అడ్డుకుంటున్న సీపీఎం నగర కార్యదర్శి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఊరుకోబోమని సీపీఎం నగర కార్యదర్శి కె నళినీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు నగరం బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయం సమీపంలో స్మార్ట్(ప్రీపెయిడ్) మీటర్లు బిగించడానికి వచ్చిన సిబ్బందిని నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ఇళ్ల యజమానులకు తెలియకుండా మీటర్లు బిగిస్తే ఊరుకోబోమని హెచ్చరించడంతో సిబ్బంది వెనుదిరిగారు. అనంతరం కె.నళినీకాంత్, విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక కన్వీనర్ షేక్ అబ్దుల్ సలీమ్ మాట్లాడుతూ ఇప్పటికే ట్రూఅప్, విద్యుత్తు సుంకం, ఇంధన సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచిన ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లతో పెనుభారం మోపేందుకు యత్నిస్తోందని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని చంద్రబాబు, లోకేష్ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చి స్మార్ట్‌మీటర్లు బిగించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి. లక్ష్మణరావు, నగర కమిటీ సభ్యులు షేక్ ఖాశిం షహీద్, జి.లూథర్ పాల్, షేక్ ఖాశిం వలి తదితరులు పాల్గొన్నారు.

47,832 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 41,094 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 47,832 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,400 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 40,899 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.